GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

T MEDIA

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 285 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | ఆదివారం 13.04.2025 | పేజీలు : 3

## వనజీవి రామయ్య మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం



**టి మీడియా, ఏప్రిల్ 12, ఢిల్లీ బ్యూరో :**

వనజీవి రామయ్య మృతిపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామయ్య చేసిన కృషి యువతలో మరింత సుస్థిరమైన హరిత గ్రహాన్ని నిర్మించాలనే తపనను ప్రేరేపిస్తూనే ఉంటుందని ఎక్స్ వేదికగా తెలుగులో పోస్టు చేశారు.

# సర్వర్ లోపాలు, సాంకేతిక సమస్యలు

## 14న రాజీవ్ యువవికాసం దరఖాస్తులకు డెడ్‌లైన్

### ఇంటర్నెట్, మీసేవ కేంద్రాల వద్ద దరఖాస్తుదారుల పడిగాపులు

**టి మీడియా, ఏప్రిల్ 12, హైదరాబాద్ బ్యూరో :**

యువత స్వయం ఉపాధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువవికాసం దరఖాస్తు ప్రక్రియలో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. సర్వర్ లోపాలతో పాటు సాంకేతిక సమస్యలతో దరఖాస్తుల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీంతో ఇంటర్నెట్, మీ సేవ కేంద్రాల వద్ద దరఖాస్తుదారులు పడిగాపులు కాస్తున్నారు. కొన్నిసార్లు అప్లికేషన్ చివరిదశకు వెళ్లిన సమయంలో సర్వర్ మొరాయిస్తుండటం, దరఖాస్తు సమర్పించిన తర్వాత అప్లికేషన్ ఫారం డౌన్‌లోడ్ కాకపోవడం లాంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఒకవేళ మళ్లీ దరఖాస్తు చేస్తే అల్రెడీ అప్లైడ్? అని వస్తుందంటూ దరఖాస్తుదారులు వాపోతున్నారు. కాగా ఎల్లుండితో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగియనుంది.

**పెండింగ్‌లో ఉన్న 6 లక్షలకు పైగా అర్జీలు**

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దారు ఆఫీసుల్లో ఆరు లక్షలకుపైగా అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు రెండో శనివారం, ఆదివారం, సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ ఆఫీసులు పనిచేయవు. దీంతో ఈ పెండింగ్ దరఖాస్తులు ఎలా పరిష్కారమవుతాయని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం మెరుగైన రాయితీతో రూ.4 లక్షల వరకు విలువైన యూనిట్లు మంజూరు చేయాలని నిర్ణయించడంతో యువత ఈ పథకానికి భారీగా దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇప్పటివరకూ 14 లక్షల మందికి పైగా ఈ పథకానికి దరఖాస్తు చేసినట్లు తెలిసింది.

**ఏళ్ల తరువాత పథకం రావడంతో**

6 ఏళ్ల విరామం తర్వాత మళ్లీ స్వయం ఉపాధి పథకానికి దరఖాస్తు చేసే అవకాశం రావడంతో రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువత ఈ పథకంపై ఆశలు పెట్టుకుంది. ఈ పథకం దరఖాస్తుల స్వీకరణ మార్చి 15వ తేదీన ప్రారంభించినప్పటికీ అప్పటికీ రుణాల పరిమితి, కేటగిరీలు, రాయితీ







నిధులకు సంబంధించి స్పష్టత రాలేదు. 10 రోజుల తర్వాత అంటే మార్చి 25న ఈ పథకం విధివిధానాలపై సర్కారు ఉత్తర్వులు జారీచేసింది. ఆ తరువాత ఈబీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరణ చేపట్టింది.

**సర్వర్‌పై ఒత్తిడితో**

మీసేవ ద్వారా జారీచేసిన కుల ధ్రువీకరణపత్రాలు(క్యాస్ట్ సర్టిఫికెట్) ఇవ్వాలని స్పష్టంచేసింది. దీంతో గతంలో ఇచ్చిన కులధ్రువీకరణ పత్రాల స్థానంలో మీసేవ ధ్రువీకరణల కోసం యువత పెద్దఎత్తున దరఖాస్తు చేశారు. రేషన్‌కార్డు లేకుంటే ఆదాయ ధ్రువీకరణ(ఇన్‌కమ్) ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేయడంతో లక్షల మంది ఆ పత్రాల కోసం మీసేవ కేంద్రాల్లో అప్లికేషన్లు ఇచ్చారు. ఆ విధంగా ఇప్పటివరకు మీసేవ కేంద్రాల ద్వారా రెవెన్యూ కార్యాలయాలకు 16 లక్షలకు పైగా క్యాస్ట్?, ఇన్?కమ్? ధ్రువీకరణ పత్రాలకు అర్జీలు వచ్చాయి. వీటిలో 10 లక్షల దరఖాస్తులను మాత్రమే అధికారులు ఆమోదించారు. సర్వర్‌పై ఒత్తిడితో రెవెన్యూ ఆఫీసుల్లో వీటి పరిష్కారం నిలిచిపోతోంది.

**సెలవులు ఎక్కువగా రావడంతో**

రాజీవ్? యువవికాసం పథకానికి సంబంధించి విధివిధానాలు అమల్లోకి వచ్చినప్పటి నుంచి సెలవులు ఎక్కువగా వచ్చాయి. రంజాన్, ఉగాది, జగ్జీవన్‌రామ్ జయంతి రోజుల్లో రెవెన్యూ ఆఫీసులు పనిచేయలేదు. ప్రభుత్వం ఈ నెల 14ను గడువుగా ప్రకటించగా. ఈ నెల 12, 13, 14 తేదీల్లో ప్రభుత్వ ఆఫీసులు పనిచేయడంలేదు. దీంతో ధ్రువీకరణ పత్రాలు అందని దాదాపు ఆరు లక్షల మంది ఆందోళన చెందుతున్నారు. ఈ పత్రాల కోసం శుక్రవారం యువత భారీసంఖ్యలో కార్యాలయాల వద్ద ఎదురుచూస్తుండటం కనిపించింది.దరఖాస్తు సమయంలోనూ సర్వర్ సమస్యలు : రాజీవ్ యువ వికాసం దరఖాస్తు చేయడానికి రూపొందించినటువంటి ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో సర్వర్ సమస్యలు నెలకొన్నాయి. దరఖాస్తు సమయంలో తరచూ సర్వర్ ఎర్రర్ మెసేజ్ రావడమనేది పరిపాటిగా మారింది. దీంతో ఒక్కో దరఖాస్తు చేయడానికి కనీసం అరగంటకు పైగా ఎదురుచూడాల్సి వస్తోందని యువత పేర్కొంటున్నారు.

## నేలకొరిగిన మహా వృక్షం

### వనజీవి రామయ్య హఠాన్మరణం


### గుండెపోటుతో కన్నుమూత

**టి మీడియా, ఏప్రిల్ 12, ఖమ్మం బ్యూరో :**

పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి రామయ్య కన్నుమూశారు. శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో ఆయన మృతి చెందారు. మొక్కల ప్రేమికుడు రామయ్య, ఇంటిపేరునే వనజీవిగా మార్చుకున్నారు. జీవితమంతా మొక్కలు నాటి పెంచారు. వనజీవి రామయ్య స్వగ్రామం ఖమ్మం జిల్లా రెడ్డిపల్లి. కోటికి పైగా మొక్కలు నాటి ఆయన సరికొత్త చరిత్రను సృష్టించారు. 2017లో ఆయన పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. రోడ్ల పక్కన, పాఠశాలలు, ఆసుపత్రులు, దేవాలయాల్లో వనజీవి రామయ్య మొక్కలు నాటేవారు. వృక్షో రక్షతి రక్షితః అంటూ ఆయన నిత్యం ప్రచారం చేసేవారు.8 పదుల వయసులోనూ మొక్కలు నాటే యజ్ఞాన్ని కొనసాగిస్తూ అటవీ సంరక్షణనే తన ఇంటిపేరుగా మార్చుకొని వనజీవిగా గుర్తింపు పొందారు. 1960 నుంచి వృక్షాలు పెంచడమే జీవితంగా మార్చుకున్న ఆయన, కోటికి పైగా మొక్కలు నాటారు. 2 వేలకు పైగా పాఠశాలల్లో ఆయన నాటిన వృక్షాలు ఉన్నాయి. తోటివారినీ మొక్కలు పెంచాలంటూ ఆయన ప్రోత్సహించేవారు. చెట్టు రూపంలో తయారు చేసిన ప్లకార్డును ధరించి కడదాకా వృక్షో రక్షతి రక్షితః అని ప్రచారం చేశారు.చదివింది ప్రాథమిక విద్య : రామయ్య చదివింది ప్రాథమిక విద్యనే అయినా చెట్లే మానవ ప్రగతి మెట్లని బాల్యంలోనే గ్రహించారు. మొదట్లో మహనీయుల జయంతి, వర్ధంతుల రోజు మొక్కలు నాటిన వనజీవి, ఆ తర్వాత పూర్తిస్థాయిలో పెంపకం చేపట్టారు. చెట్టు గొప్పదనాన్ని తెలిపేలా 60 వరకు పాటలు, 2 వేలకు పైగా సూక్తులు రాశారు. మొదట్లో మొక్కలు నాటుతుంటే అందరూ చూసి నవ్వినా అలాంటి వారిని పట్టించుకోకుండా పచ్చని వనాలే లక్ష్యంగా మొక్కలతోనే సహజీవనం చేశారు.ఎవరు తన ఇంటికి వచ్చినా రామయ్య మొక్కలను బహుమతిగా ఇచ్చేవారు. రుతువులకు అనుగుణంగా విత్తనాలు సేకరించి మొక్కలను నాటేవారు. ఆయన గురించి తెలుసుకున్న చంద్రబాబు ఓ ద్విచక్రవాహనం కొనివ్వగా ఆ వాహనంపై తిరుగుతూ ఇంకా ఉత్సాహంగా మొక్కలు నాటడంలో నిమగ్నమయ్యారు. దేశానికి ప్రతిభావంతులైన పౌరులేకాదు బండరాళ్లనైనా పెకిలించి చెట్లను పెంచే పౌరులు అత్యవసరమని భావించేవారు రామయ్య. ప్రతి తల్లి తన పిల్లలతో మూడు మొక్కలు నాటించాలని హితోబోధ చేశారు.పర్యావరణ పరిరక్షణకు రామయ్య చేస్తున్న కృషిని గుర్తించిన అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ 2013లో డాక్టరేట్ ప్రదానం చేసింది. నాటి ప్రధాని పీవీ సహా గవర్నర్లు, ముఖ్యమంత్రుల నుంచి సత్కారాలు అందుకున్నాడు. రాష్ట్ర రెండో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగాన రామయ్య సేవల్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల నగదుతో పాటు జ్ఞాపికను బహుకరించింది.దాదాపు 5 దశాబ్దాలుగా మొక్కలు నాటడం కర్తవ్యంగా భావించడమే కాదు తెలుగునేలను హరితమయం చేసిన వనజీవి రామయ్యను కేంద్రం దేశ అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీతో గౌరవించింది. రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.వనజీవి రామయ్య మృతి **పట్ల ప్రధాని మోదీ సంతాపం :**

వనజీవి రామయ్య మృతిపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామయ్య చేసిన కృషి యువతలో మరింత సుస్థిరమైన హరిత గ్రహాన్ని నిర్మించాలనే తపనను ప్రేరేపిస్తూనే ఉంటుందని ఎక్స్ వేదికగా తెలుగులో పోస్టు చేశారు.







## హైకోర్టు పేరుతోనే నకిలీ ఉత్తర్వులు

### ధర్మాసనం సీరియస్

### సిట్‌తో దర్యాప్తునకు ఆదేశాలు

**టి మీడియా, ఏప్రిల్ 12, హైదరాబాద్ బ్యూరో :**

వివాదాస్పద పైగా(ఇనాం) భూములపై హక్కుల కోసం హైకోర్టు పేరుతో నకిలీ ఉత్తర్వులు సృష్టించడంపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. గతంలో హైకోర్టులో బాధ్యతలు చేపట్టకముందే ఓ న్యాయమూర్తి పేరుతో ఉత్తర్వులు సృష్టించడం న్యాయప్రక్రియలో జోక్యం చేసుకోవడమే అవుతుందని స్పష్టంచేసింది.దానిపై రిపోర్టు తెప్పించిన హైకోర్టు ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేయాలంటూ జ్యుడిషియల్ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ ఫిర్యాదుపై దర్యాప్తు నిమిత్తం ప్రత్యేక బృందాన్ని(సిట్‌ను) ఏర్పాటుచేసి త్వరితగతిన దర్యాప్తు జరిపించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది.




**హెచ్‌ఎండీఏ అప్పీలు**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని సర్వే నం.661 నుంచి 664, 720, 721, 724 నుంచి 732, 775లలో సుమారు 100ఎకరాల దాకా పైగా భూములకు సంబంధించిన హక్కులపై మహమ్మద్ తాహెర్‌ఖాన్ అనే వ్యక్తికి అనుకూలంగా సివిల్‌కోర్టు ఇచ్చిన ఆదేశాలపై హెచ్‌ఎండీఏ(హైదరాబాద్? మెట్రోపాలిటన్ డెవలప్?మెంట్ అథారిటీ) అప్పీలు దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ పి.శ్రీసుధ, జస్టిస్ టి.వినోద్‌కుమార్?లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

**ఎలాంటి రికర్డు లేదు**

హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న సీఎస్ 7/1958లో అప్లికేషన్?కు సంబంధించి 1988 డిసెంబరు 28న హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ ఎన్.డి.పట్నాయక్ అంతకుముందే (ఏప్రిల్ 29న) జారీచేసినట్లుగా నకిలీ ఉత్తర్వులను సృష్టించారు. అంతేకాకుండా ఈ భూములకు సంబంధించి కొంతమందికి అనుకూలంగా ఆదేశాలు వచ్చాయంటూ పేర్కొన్న పిటిషన్ నంబరుతో హైకోర్టులో ఎలాంటి రికార్డు లేదు.

**అసలు పిటిషన్ లేదు**


దీనిపై పలు రకాల అనుమానాలు రావడంతో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని గతంలో హైకోర్టు జ్యుడిషియల్ రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీచేసింది. దీనిపై దర్యాప్తు చేస్తే అసలు పిటిషన్ లేకుండా జారీ అయినట్లుగా నకిలీ ఉత్తర్వులు సృష్టించినట్లు నివేదిక సమర్పించినట్లు తేలింది. గతంలోనూ ఇలా నకిలీ ఉత్తర్వులు సృష్టించినట్లు వెల్లడి కావడంతో రెండు ఫిర్యాదులు చేసినట్లు రిపోర్టులో పేర్కొన్నారు.ఎఫ్?ఐఆర్?లపై దర్యాప్తునకు సిట్ : ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై బాధ్యులైన వారిపై చర్య తీసుకునేందుకుగాను పోలీసులకు కంప్లైంట్? ఇవ్వాలని జ్యుడిషియల్ రిజిస్ట్రార్‌ను న్యాయస్థానం ఆదేశించింది. ఇప్పటికే నమోదైన రెండు ఎఫ్ఐఆర్‌లపై దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేయాలని ప్రభుత్వానికి ఆదేశాలిచ్చింది. అంతేకాకుండా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్? సుజయ్? పాల్? అనుమతితో నకిలీ ఉత్తర్వుల వివరాలను జిల్లా జ్యుడిషియల్ అధికారులకు పంపాలని, వీటి ఆధారంగా ఎలాంటి ఆర్డర్? ఇవ్వకుండా సర్క్యులర్ జారీకి చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది.ఈ నకిలీ ఉత్తర్వు కాపీల వివరాలను ప్రజలను అప్రమత్తం చేయడానికిగాను హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టాలని పేర్కొంది. అప్పటివరకు శంషాబాద్‌లోని పైగా భూములపై యథాతథస్థితి(స్టేటస్? కో) కొనసాగించాలంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులే కొనసాగుతాయని స్పష్టంచేసింది. దర్యాప్తులోని పరిణామాల ఆధారంగా ఈ పిటిషన్‌పై సత్వర విచారణకు దరఖాస్తు చేసుకోవచ్చని పిటిషనర్లకు సూచనలు చేసింది.

## దేశంలో ఉగ్రదాడులు జరిగే ఛాన్స్

### నిఘా సంస్థల హెచ్చరిక!

**టి మీడియా, ఏప్రిల్ 12, ఢిల్లీ బ్యూరో :**

భారత్‌లో ఉగ్రదాడులు జరగవచ్చని నిఘా సంస్థలు హెచ్చరికలు చేశాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడులకు దిగవచ్చని హెచ్చరించాయి. ఇప్పటికే రైల్వేశాఖను అప్రమత్తం చేశాయి. డ్రోన్, ఐఈడీతో ఉగ్రవాదులు దాడులు చేసే అవకాశం ఉందని వెల్లడించాయి. నదీమార్గాల ద్వారా తీవ్రవాదులు చొరబడవచ్చని చెప్పాయి. 26/11 ముంబయి దాడుల్లో కీలక కుట్రదారు అయిన తహవ్వుర్ రాణాను అమెరికా నుంచి భారత్‌కు తీసుకువచ్చి విచారిస్తోన్న తరుణంలో ఈ అలర్ట్ రావడం గమనార్హం.2008 నవంబర్ 26న 10 మంది పాకిస్థానీ ఉగ్రవాదులు సముద్రమార్గం ద్వారా ముంబయికి చేరుకొని మారణహోమం సృష్టించారు. సీఎస్ఎంటీ, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్ తదితర ప్రాంతాల్లో గన్స్‌తో, బాంబులతో దాడులకు పాల్పడ్డారు. నవంబర్ 29 వరకు ఈ మారణహోమం కొనసాగింది. ఈ ఉగ్రదాడుల్లో 18 మంది భద్రతా సిబ్బంది సహా 166 మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఉగ్రవాదులతో పోరాడుతూ అప్పటి యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) చీఫ్ హేమంత్ కర్కరే, ఆర్మీ మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్, ముంబయి అదనపు పోలీస్ కమిషనర్ అశోక్ కామ్టే, సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ విజయ్ సలాస్కర్‌లు అమరులయ్యారు. కాగా రాణా పాకిస్థాన్ మూలాలున్న కెనడా జాతీయుడు. డేవిడ్ హెడ్లీతోపాటు 26/11 ముంబయి దాడుల్లో కీలక సూత్రధారిగా ఉన్నాడు.



**ఉగ్రవాదులతో పోరాడుతూ**

జమ్మూలోని అఖ్నూర్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వద్ద, భారత్‌లోకి చొరబడే ప్రయత్నం చేసిన ఉగ్రవాదులను భద్రత దళాలు సమర్థవంతంగా అడ్డుకున్నాయి. అయితే ఉగ్రవాదులను నిరోధించే క్రమంలో ఇండియన్ ఆర్మీకి చెందిన జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీఓ) సుబేదార్ కుల్దీప్ సింగ్ అమరుడైనట్లు అధికారులు తెలిపారు.దేశంలోకి చొరబడాలనే ఉగ్రవాదుల ప్రయత్నాన్ని సుబేదార్ కుల్దీప్ సింగ్, అతని బృందం భగ్నం చేసింది. ఈ ప్రయత్నంలో కుల్దీప్ సింగ్ అమరులయ్యారు. ఈ దుఃఖ సమయంలో మేము వారి కుటుంబానికి సంఘీభావం తెలియజేస్తున్నాం." అని జమ్మూకు చెందిన వైట్ నైట్ కార్ప్స్, కార్ప్స్ ట్వీట్ చేసింది.

## నేను జర్నలిస్టుగా పనిచేశా

### సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ

### సంఘాలు ఎక్కువయ్యాయి - విలువలు తగ్గాయి

**టి మీడియా, ఏప్రిల్ 12, హైదరాబాద్ బ్యూరో :**

నేను ఒకప్పుడు జర్నలిస్టునే.. మీడియా రంగం గురించి నాకు అనుభవం ఉంది.. మీడియా రంగంలో ఉన్న ఇబ్బందులు ఇతర అంశాల పట్ల అవగాహన ఉందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ అన్నారు.

మిగతా 3లో..



# చింతల ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎస్పీ

**టీ మీడియా, ఏప్రిల్ 12, వనపర్తి బ్యూరో :**

హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం రోజు జిల్లా కేంద్రంలోని చింతల్ హనుమాన్ దేవాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ బందోబస్తు ఏర్పాటును పరిశీలించి దేవాలయంలో శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో హనుమాన్ జయంతి శోభాయాత్రలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని అందుకు పోలీసు శాఖ నుండి పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. శోభాయాత్ర సమయంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు కచ్చితంగా వాలంటీర్స్ ఏర్పాటు చేసుకుని ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ముందుగా జిల్లా పరిధిలో ఎక్కడ శోభయాత్ర ఊరేగింపు చేస్తున్నారు పోలీస్ పర్మిషన్, (సమాచారం)తో నిర్వహించుకోవాలని అందుకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే పెద్దలు, చిన్న పిల్లల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని పెద్ద సౌండ్ వచ్చే డీజే లను అనుమతించేది లేదని లౌడ్ స్పీకర్లను, బ్యాండ్, డోలు లను, సంప్రదాయ నృత్యాలు ఉపయోగించు కోవాలని ఎస్పీ సూచించారు. అలాగే సోషల్ మీడియాలో ఒక మతాన్ని కించపరుస్తూ పోస్టులు చేయరాదని ఎవరికి ఎలాంటి సమాచారం తెలిసిన వెంటనే తప్పనిసరిగా సంబంధిత లోకల్ పోలీసులకు, డయల్100 కి సమాచారం ఇవ్వాలని వాటిని వెంటనే పరిష్కరించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియాలో ఒక సమాచారని షేర్ చేసే ముందు జాగ్రత్తగా షేర్ చేయాలని



సూచించారు. ప్రస్తుతం కొత్త టెక్నాలజీ ఉన్నందున కొంతమంది కావాలని ముఖాలను మార్చి తప్పుడు పోస్టులు సృష్టిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారని అలాంటి వారిపై పూర్తిస్థాయిలో జిల్లా స్థాయిలో సోషల్ మీడియా కంప్లైంట్ సెల్ ద్వారా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని అట్టి వ్యక్తుల పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. శోభయాత్రలో ఎలాంటి అలజడి సృష్టించాలని చూసిన అట్టి వ్యక్తులు ఎలాంటి వారైనా చట్ట ప్రకారం పక్కా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అందుకు బాధ్యులుగా ఉత్సవ కమిటీ సభ్యులు ఉంటారని తెలిపారు. ప్రజలంతా కులమతాలకతీతంగా తమ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని అందుకు పోలీస్ వారి పూర్తి సహకారం ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు శాఖకు పూర్తిగా సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సాయిధ దళ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వరరావు, వనపర్తి సిఐ, కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, సిసిఎస్ సిఐ, రవిపాల్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, గోపాల్పేట ఎస్సై, నరేష్, వనపర్తి రూరల్ ఎస్సై, జలేందర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు. వివిధ మండలాల విశ్వవింధు పరిషత్, బజరంగ్, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

# తిరుమలలో అపచారం

- పాదరక్షలతో ఆలయం వద్దకు వెళ్లిన భక్తులు
- అడ్డుకున్న విజిలెన్స్ సిబ్బంది

**టి మీడియా, ఏప్రిల్ 12, తిరుమల :**

తిరుమలలో భద్రతా వైఫల్యం చోటు చేసుకుంది. శ్రీవారి ఆలయ మహాద్వారం వద్దకు పాదరక్షలతో భక్తులు చేరుకున్నారు. దీంతో అక్కడ ముగ్గురు భక్తులను విజిలెన్స్ సిబ్బంది అడ్డుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో వీరిని తనిఖీ సిబ్బంది గుర్తించకుండా లోపలికి పంపించారు. తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు వైకుంఠ క్యూ కాంప్లెక్స్ గుండా ప్రవేశించాల్సి ఉంటుంది. వైకుంఠ క్యూ కాంప్లెక్స్ వద్ద భక్తుల వద్ద నిషేధిత వస్తువులు, సెల్ ఫోన్స్, పాదరక్షలు ఉంటే అక్కడే అడ్డుకుంటారు. అనంతరం ఆ వస్తువులను తీసుకున్న తర్వాత భక్తులను స్వామి వారి దర్శనానికి ప్రవేశిస్తారు. శనివారం ఆ ముగ్గురు భక్తులు పాదరక్షలతో శ్రీవారి ఆలయ మహాద్వారం వద్దకు రావడంతో భద్రతా వైఫల్యం వెలుగు చూసింది. దీంతో భద్రతా సిబ్బందిపై శ్రీవారి భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



### కారుపై అన్యమత వ్యాఖ్యలు

తిరుపతి అలిపిరి తనిఖీ కేంద్రంలో ఇటివలే భద్రత వైఫల్యం కనిపించింది. తిరుమలకు చేరుకున్న అన్యమత వ్యాఖ్యలతో కూడిన ఓ కారు కనిపించింది. సాధారణంగా అలిపిరి తనిఖీ కేంద్రంలో రాజకీయ పార్టీల చిహ్నాలు, అన్యమత చిహ్నాలు, ఫొటోలు అనుమతించరు. అయితే కారుపై అన్యమత వ్యాఖ్యలు ఉన్నాయి. అది తిరుమలకు చేరుకోవడంపై టీటీడీ తనిఖీ భద్రతా వైఫల్యాన్ని సూచిస్తుంది. అలాగే కొద్దిరోజుల కిందట అలిపిరి గేటు వద్ద తనిఖీలను తప్పించుకుని ఓ అన్యమత వ్యక్తి బైకుతో ఘాటు రోడ్డులో హల్ చల్ చేసిన సంగతి తెలిసిందే. విచారించిన సిబ్బంది అతని మానసిక పరిస్థితి సక్రమంగా లేదని తేల్చారు. ఇకనైనా తనిఖీ కేంద్రం సిబ్బంది పటిష్ట తనిఖీలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

# గుడికి లక్ష రూపాయల విరాళం

- 22 వ వార్డు నాయకులు మెకానిక్ శ్రీను

**టీ మీడియా, ఏప్రిల్ 12, వనపర్తి బ్యూరో :**



వనపర్తి పట్టణం 22 వ వార్డు శ్వేతా నగర్ లోని శ్రీ మర్రిచెట్టు బాల ఆంజనేయ స్వామి ధ్వజస్థంబ మరియు నవగ్రహ ప్రతిష్ఠా మహెూత్సవా కార్యక్రమంలో పాల్గొన్న 22వ వార్డు నాయకులు మెకానిక్ శ్రీను. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి నవగ్రహల పూజలో పాల్గొని అనంతరం ధ్వజస్తంభ కార్యక్రమంలో కమిటీ సభ్యులతో కలిసి పాలుపంచుకోవడం జరిగింది. మెకానిక్ శ్రీను ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించడం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మెకానిక్ శ్రీను శ్రీ మర్రిచెట్టు బాల ఆంజనేయ గుడికి 100000/- ఒక్క లక్ష రూపాయల విరాళం ఇవ్వడం జరిగింది అని తెలియజేశారు.

# సమాచార హక్కు చట్టం ఆక్టివిస్ట్స్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులుగా జి.రవికుమార్

**టీ మీడియా, ఏప్రిల్ 12, వనపర్తి బ్యూరో :**



సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం లాంటిదని జి.రవికుమార్ అన్నారు. సమాచార హక్కు చట్టం ఆక్టివిస్ట్స్ ఫోరమ్ వనపర్తి జిల్లా అధ్యక్షులుగా మదనాపురం మండలానికి చెందిన జి.రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల గణేష్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైయినా జి.రవికుమార్ మాట్లాడుతూ ప్రతి సామాన్యుడుకి సమాచార హక్కు చట్టం ఒక బ్రహ్మాస్త్రం అన్నారు. సమాచార హక్కు చట్టం సామాన్యులకు ప్రభుత్వ అధికారుల నుంచి సమాచారం పొందేందుకు ఈ చట్టం ద్వారా ప్రజలు ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో తెలుసుకునే హక్కును పొందవచ్చు అన్ని తెలిపారు. ప్రజలు కోరిన సమాచారాన్ని సంబంధిత అధికారులు 30 రోజుల్లోపు అందించాలని సూచించారు. ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలుకు కృషి చేస్తానని, ఆర్టీఐ పై అవగాహన కార్యక్రమాలు చేపడతానని, సొసైటీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారానే ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారితనం సాధ్యమన్నారు. తన పైన ఉన్న నమ్మకంతో తనకు బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.



# బిసిఎఫ్ జిల్లా అధికార ప్రతినిధిగా

- అక్కల నాగరాజు గౌడ్

**టీ మీడియా, ఏప్రిల్ 12, వనపర్తి బ్యూరో :**

వనపర్తి పట్టణంలోని బిసిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నాగనమోని చెన్న రాములు ముదిరాజ్ నివాస గృహంలో బిసిఎఫ్ వనపర్తి జిల్లా అధికార ప్రతినిధిగా అక్కల నాగరాజు గౌడ్ ని బిసిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నాగనమోని చెన్నరాములు ముదిరాజ్ నియమించడం జరిగింది. నాగరాజు గౌడ్ మాట్లాడుతూ బిసిఎఫ్ ను బలోపేతం చేస్తానని ఆశయాలకు అనుగుణంగా కష్టపడి నిరంతరం పనిచేసి బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు . ఈ సందర్భంగా చెన్న రాములు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు 42 శాతం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించినందున వెంటనే జీవో విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు బీసీలకు సరి అయినటువంటి ప్రాధాన్యతరించి మంచి నాయకత్వ స్థాయిని అందించి ప్రోత్సహించి గౌరవిస్తే అన్ని రాజకీయ పార్టీలు సజీవంగా ఉంటాయి లేకపోతే చరిత్ర గర్భంలో కలిసిపోతాయని ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలను హెచ్చరిస్తున్నాం. ఈ సమావేశంలో బీసిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లాడి భగవంతు గౌడ్ , రాష్ట్ర కార్యదర్శి కె వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి, మహాజన రైతు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమడబాకుల రామన్ గౌడ్ మాజీ ఎంపిటిసి , మహాజన మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జానంపేట లీలావతి పాల్గొన్నారు.



# హనుమాన్ జయంతి..అన్నదాన కార్యక్రమం

**టీ మీడియా,ఏప్రిల్ 12,గోదావరిఖని :**

రామగుండం పట్టణంలో,సండే మార్కెట్ యువ సేన మిత్ర మండలి ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ విగ్రహానికి కొబ్బరికాయలు కొట్టి,తమలపాకు ఆకుల దండా వేసి ఘనంగా పూజ చేసి,అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దుస్సా నరేష్,నిమ్మని సంతోష్,జర్నలిస్టు గూడూరు లవన్ కుమార్, బొడ్డుపల్లి శీను,నారాయణ, నడమ రమేష్,పిల్లి సారయ్య,పిల్లి సూరి,పిల్లి రాము,రేనుల రవి,అన్వేష్, బొడ్డుపల్లి సతీష్,లోకనాథ్, ప్రకాష్,బొడ్డుపల్లి సాయి, అధిక సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

- సన్న బియ్యమ్ వస్తున్నందున హర్షం వ్యక్తమ్ చేసిన మహిళలు

**టీ మీడియా, ఏప్రిల్ 12, వనపర్తి బ్యూరో :**

వనపర్తి పట్టణ కేంద్రం 4వ వార్డులో యూత్ కాంగ్రెస్ నాయకులు నరసింహ ఆద్వర్యంలో రేవంతన్న ప్రభుత్వం రేషన్ లో అందిస్తున్న సన్న బియ్యం ఏర్పటు చేసిన బోజన కార్యక్రమంలో పాల్గొని తదనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన వార్డ్ మహిళలు, వనపర్తి జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు దివాకర్ యాదవ్ , 4వ వార్డ్ కౌన్సిలర్ పరుశురాం , వనపర్తి జిల్లా ఎన్ఎస్యుఐ అధ్యక్షుడు రోహిత్ , యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు అక్షయ్, వనపర్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల చెంద్రశేఖర్ , యూత్ కాంగ్రెస్ నాయకులు మహేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.


# మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలి

- టిఎస్ యుటిఎఫ్ సెమినార్‌లో ఏ.వెంకట్

**టీ మీడియా, ఏప్రిల్ 12, వనపర్తి బ్యూరో :**



వ్యవస్థ మార్పు కోసం, సామాజిక అభివృద్ధి కోసం పాటుపడిన మహనీయులైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకట్ పిలుపు ఇచ్చారు. శుక్రవారం రాత్రి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక టి ఎన్ జివో భవనంలోజరిగిన భారత రాజ్యాంగం- సామాజిక న్యాయం అనే అంశంపై సెమినార్ జరిగింది. మహనీయుల మాసమైన ఏప్రిల్ సందర్భంగా పూలే,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతులను పురస్కరించుకొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసిన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో కులవివక్షత, అంటరానితనం ,పేదరికం, నిరుద్యోగము తాండవిస్తుందని అసమానతలు లేని సమాజం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కులవివక్ష రూపం మారుతుందని అన్నారు. మనకు రాజ్యాంగం అనేక హక్కులు, బాధ్యతలను ఇచ్చిందని, అలాంటి రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని కాపాడుకోవాల్సిన బాధ్యత మేధావులైన ఉద్యోగ ఉపాధ్యాయులపై ఎంతైనా ఉన్నదన్నారు. మధ్య తరగతి ఉద్యోగులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన భారాలు మోపుతున్నాయని ఈ సమస్యల పట్ల స్పందించి ప్రశ్నించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక ప్రధాన కార్యదర్శులు ఎస్ .రవి ప్రసాద్ గౌడ్ ,డి.కృష్ణయ్య జిల్లా ఉపాధ్యక్షులు బి. వెంకటేష్ , కోశాధికారి తిమ్మప్ప, కేవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. రాధాకృష్ణ ఫెన్సేన్ దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రామన్ గౌడ్ , నాయకులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్ నాయక్, చిరంజీవీ, జి.మురళి,అయోధ్యరాముడు,డి, రాముడు పాల్గొన్నారు.




# నిలిచిపోయిన యూపీఐ సేవలు

**టి మీడియా, ఏప్రిల్ 12, ఢిల్లీ బ్యూరో :**

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లో శనివారం టెక్నికల్ ప్రాబ్లం రావడంతో డిజిటల్ పేమెంట్స్ నిలిచిపోయాయి. భారతదేశంలో చాలా మంది వినియోగదారులు డిజిటల్ చెల్లింపులకు వీలుకావడం లేదని రిపోర్ట్ చేస్తున్నారు. ఫోన్ పే, గూగుల్ పే డిజిటల్ పేమెంట్ యాప్‌లు పనిచేయడం లేదని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో యూపీఐ చెల్లింపులలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం 12 గంటల సమయానికి సమస్య మరింత పెరిగింది. ఆ సమయంలో ఏకంగా 1200 మంది యూపీఐ చెల్లింపులపై రిపోర్ట్ చేశారు. 66 శాతం యూజర్లకు పేమెంట్ చేసే సమయంలో సమస్య తలెత్తినట్లు పేర్కొన్నారు. మరో 34 శాతం మంది యూజర్లకు ఫండ్ ట్రాన్స్‌ఫర్ కావడం లేదని రిపోర్ట్ చేశారు. ఇటీవల మార్చి నెలాఖరులలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ ఉన్న యూపీఐ వినియోగదారుల టెక్నికల్ ప్రాబ్లమ్ తో పేమెంట్స్ చేయలేకపోయారని తెలిసిందే.



# విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పై దృష్టి పెట్టాలి

- కరస్పాండంట్ సూగురు విజయమోహన్ రావు

**టీ మీడియా, ఏప్రిల్ 12, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లా కేంద్రంలోని యంబీ. గార్డెన్ లో ఎస్వీఎంఆర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగిందని అదేవిధంగా విద్యార్థులు ఇపుడు వున్న పోటీ ప్రపంచంలో విజయం సాదించాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ పై దృష్టి పెట్టాలని అందరు ఉన్నత స్థాయికి చేరుకోవాలని అదేవిధంగా తల్లి తండ్రులను గౌరవించాలని కూడా కరస్పాండంట్ సూగురు విజయమోహన్ రావు తెలియజేశారు. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షన, హార్డ్‌వర్క్ తో చదివితే అతి చిన్న వయసులోనే ఉద్యోగం సంపాదించవచ్చును ముఖ్యంగా ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు బాగా చదువుకొని కళాశాలకు మీ తలితండ్రులకు మంచి పేరు తీస్కారవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ సంస్కృతిక కార్యక్రలలో పాల్గొని అలరించారు. అదేవిదంగా వార్షికోత్సవం లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ చందపాషా, చెంద్రమౌళి, రవి కిరణ్ , కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు.

# ఆస్తులన్నీ అమ్మి చదివించాం

- ఇప్పుడు రోడ్డున పడేశాడయ్యా
- న్యాయం చేయాలని ఎస్పీకి విన్నపం

**టి మీడియా, ఏప్రిల్ 12, మాచర్ల :**



ఒక్కగానొక్క కుమారుడు అని ఆ తల్లీదండ్రులు కంటికి రెప్పలా చూసుకుంటూ అల్లారుముద్దుగా పెంచుకున్నారు. తమ కుమారుడిని ఉన్నతస్థానంలో చూడాలని కలలు కన్నారు. కాయాకష్టం చేసి ఉన్నత చదువులు చదివించారు. ఆస్తులు అమ్మి ప్రయోజకుడిని చేశారు. ఉన్నదంతా కరిగిపోయినా తమ బిడ్డ అమెరికాలో స్థిరపడ్డాడని ఆ అమాయక తల్లీదండ్రులు సంతోషపడ్డారు. అయితే ఆ సంతోషం వారికి ఎంతోకాలం లేదు. విదేశాలకు వెళ్లిన కుమారుడు తల్లిదండ్రుల బాగోగులు చూడకపోవడం వల్ల తల్లడిల్లిపోయారు. చివరికి కోర్టును ఆశ్రయించాల్సిన దుస్థితి వచ్చింది.

**అమెరికాలో స్థిరపడిన కొడుకు**

పల్నాడు జిల్లా మాచర్ల మండలం విజయపురిసౌత్‌కు చెందిన బ్రహ్మారెడ్డి, విజయలక్ష్మి దంపతులు నివసిస్తున్నారు. వీరి కుమారుడు అంజిరెడ్డి. తమకున్న 8.5 ఎకరాల భూమితోపాటు ఆస్తులను అమ్మి కుమారుడిని ఉన్నత చదువులు చదివించారు. చదువు అనంతరం అతను అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా స్థిరపడ్డాడు. ఆ తర్వాత వృద్ధులైన దంపతులను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు.

**దుర్భర జీవనం గడపలేక ఆత్మహత్యాయత్నం**

అనారోగ్యంతోపాటు ఆర్థిక పరిస్థితి దిగజారడంతో దుర్భర జీవనం గడపలేక ఆ తల్లిదండ్రులు గతంలో ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు అడ్డుకుని, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, నరసరావుపేటలో ఎస్పీ శ్రీనివాసరావును కలిసే ఏర్పాట్లు చేశారు. దీంతో ఎస్పీకి తమ బాధను తెలియజేశారు. గతంలో పోలీసులకు కుమారుడిపై ఫిర్యాదు చేశామని, ఓ వైఎస్సార్సీపీ నాయకుడి అండతో కేసును నీరుగార్చారని వాపోయారు. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు తెలిపారు. దిక్కులేక కోర్టులో కేసు వేశామని, నెలకు రూ.10 వేలు భరణం ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చిందని కానీ కోర్టు తీర్పును కూడా తమ కుమారుడు ఖాతరు చేయడం లేదని ఎస్పీకి తెలియజేశారు. ఈ క్రమంలోనే గురువారం (10/04/2025) మాచర్ల పర్యటనకు వచ్చిన ఎస్పీ ఆ వృద్ధ దంపతుల ఇంటికి వెళ్లారు. వారితో మాట్లాడి న్యాయం చేస్తానని మరోసారి హామీ ఇచ్చారు. ఎస్పీ వెంట తహసీల్దారు కిరణ్‌కుమార్, రూరల్ సీఐ నఫీజ్ బాషా, ఎస్సై మహమ్మద్ షఫీ తదితరులు ఉన్నారు.

